క్లుప్తంగా

మంత్రి జగదీష్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే సైదిరెడ్డి



మంత్రి జగదీష్‌రెడ్డితో ఎమ్మెల్యే సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డిని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మళ్లీ ఎమ్మెల్యే టికెట్ వచ్చిన సందర్భంగా వారు పరస్పరం అభినందనలు తెలుపుకున్నారు. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ స్థానాల్లో గెలుపొంది సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలని వారు పేర్కొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని వేపల సింగారంలో సీసీరోడ్డు నిర్మాణ పనులను మంగళవారం సర్పంచ్ అన్నెం శిరీషాకొండారెడ్డి, ఎంపీటీసీ ముడెం గోపిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే సైదిరెడ్డి సహకారంతో మంజూరైన రూ.45లక్షల నిధులతో గ్రామంలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం నుంచి ఆర్‌సీఎం చర్చి వరకు సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కర్నె సావిత్రి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ 'గృహలక్ష్మి' వర్తింపజేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న వెంకటేశ్వర్లు

మునగాల : రాజకీయాలకతీతంగా గృహలక్ష్మి పథకాన్ని అర్హులందరికీ వర్తింపజేయాలని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి జిల్లేపల్లి వెంకటేశ్వర్లు కోరారు. ఈమేరకు మంగళవారం స్థానిక ఇన్‌చార్జ్ తహసీల్దార్ కరుణశ్రీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు గ్రామాల్లో సర్వే చేపట్టి ఇల్లులేని నిరుపేదలను పారదర్శకంగా ఎంపిక చేయాలన్నారు. కార్యక్రమంలో కోట నవీన్‌కుమార్, కోట జ్యోతిబసు, జిల్లేపల్లి వినయ్, నరేష్, బాలకృష్ణ, అంజి పాల్గొన్నారు.

గౌడ సామాజిక వర్గానికి అన్ని జిల్లాల్లో టికెట్లు ఇవ్వాలి

గరిడేపల్లి : రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో గౌడ సామాజిక వర్గానికి ఒక ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు రాంబాబుగౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ ప్రకటించిన జాబితాలో గౌడ సామాజిక వర్గానికి అధిక ప్రాధాన్యత ఇవ్వకపోవడం దురదృష్టకరంగా ఉందన్నారు. తెలంగాణలో 40 లక్షల మంది గౌడ సామాజిక వర్గానికి చెందిన వారు ఉన్నారని తెలిపారు. గౌడ సామాజిక వర్గాన్ని ఏ రాజకీయ పార్టీ కూడా గుర్తించకుంటే రాబోయో ఎన్నికల్లో అన్ని స్థానాల్లో గౌడ సామాజిక వర్గం అభ్యర్థిని పోటీలో నిలిపి రాజకీయ పార్టీలకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

రోడ్డు నిర్మాణంలో నాణ్యత లోపం



నిర్మించిన నెల రోజులకే తారు లేస్తున్న రోడ్డు

మునగాల : మండలంలోని ముకుందాపురం గ్రామపంచాయతీ పరిధిలో జాతీయ రహదారి నుంచి నడిగూడెం మండలం ఎకలాస్‌ఖాన్‌పేట వరకు రోడ్డు వేసి కనీసం నెల రోజులైనా గడవకముందే తారు లేచి పెచ్చులూడుతోంది. రోడ్డును నాణ్యత లోపంతో నిర్మించడంతోనే ఇలా తయారైందని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణాన్ని పరిశీలించి సదరు కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోవాలని కోరుతున్నారు.

కార్మికులను ఆదుకోవాలి

హుజూర్‌నగర్ : కార్మికులను యజమానులు ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను కోరారు. మంగళవారం హుజూర్‌నగర్‌లో సైకిల్ షాప్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం), షాపు యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్కర్లు కోరిన పలు డిమాండ్లను షాపు యజమానులు అంగీకరించారు. యూనియన్ నాయకులు ఎస్.రాంబాబు, ఎం.వెంకటనారాయణ, బి.మస్తాన్, ఎన్.రవి, జి.వెంకటేశ్వర్లు, జి.రాము, పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నూతన జీపీలకు పక్కా భవనాలు

- గ్రామాల్లో ముమ్మరంగా కొనసాగుతున్న భవనాల నిర్మాణాలు
- ఒక్కో జీపీకి రూ.20 లక్షలు మంజూరు

చిలుకూరు : మండలంలోని నూతన గ్రామ పంచాయతీలకు మహర్దశ పట్టింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పరిపాలన సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన నూతన గ్రామ పంచాయతీలలో ప్రభుత్వం పక్కా భవనాలు నిర్మిస్తోంది. ఆ భవనాలు పూర్తయితే పాలకవర్గం, అధికారులు, ప్రజల ఇబ్బందులు తొలగనున్నాయి. మండలంలో జానకీనగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని దూదియాతండా, జెర్రిపోతులగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని కొమ్ముబండతండా, కొండాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని మాధవగూడెం, ఆర్లెగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని రామ్‌చంద్రానగర్ గ్రామాలను ప్రభుత్వం 5 ఏళ్ల క్రితం నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. ఆనాటి నుంచి ఆయా గ్రామ పంచాయతీలకు జీపీ భవనాలు లేవు. దీంతో దూదియాతండా, మాధవగూడెం, కొమ్ముబండతండా గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని ఒక గదిలో, అలాగే రామ్‌చంద్రానగర్‌లో గ్రంథాలయం భవనంలో గ్రామ పంచాయతీ నిర్వహణ సాగిస్తున్నారు.

ఒక్కో భవన నిర్మాణానికి రూ.20 లక్షలు..

కాగా, నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలకు స్థానిక ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ చొరవతో ఉపాధి హామీ పథకం నుంచి నిధులు మంజూరు అయ్యాయి. అయితే మాధవగూడెం, దూదియాతండా, రామ్‌చంద్రనగర్ గ్రామాల్లోని నూతన గ్రామ పంచాయతీ భవనాలకు ఒక్కో భవనానికి రూ.20 లక్షల చొప్పున మొత్తం రూ.60 లక్షలు మంజురయ్యాయి. దీంతో ఆయా గ్రామాల్లో పంచాయతీ భవనాల నిర్మాణాలు ముమ్మరంగా సాగుతున్నాయి. కొమ్ముబండతండాకు మాత్రం ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాలేదు. కాగా దూదియాతండా, రామ్‌చంద్రనగర్ గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలు స్లాబ్ దశ వరకు పూర్తయ్యాయి. మాధవగూడెం గ్రామ పంచాయతీ భవనం స్లాబ్ దశకు చేరుకుంది. మరో రెండు రెండు నెలల్లో నిర్మాణ పనులు పూర్తికానున్నాయి. నూతన గ్రామ పంచాయతీ భవనాల్లో సర్పంచ్, గ్రామ కార్యదర్శులకు ప్రత్యేక గదులతో పాటు, మీటింగ్ హాల్, స్టోర్ రూం, వరండాలు ఏర్పాటు చేస్తున్నారు. భవన నిర్మాణ పనులు పూర్తయితే గ్రామ పంచాయతీ నిర్వహణ ఇబ్బందులు తొలగుతాయని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శులు, గ్రామస్తులు అంటున్నారు.



దూదియాతండాలో తుది దశకు చేరుకున్న పంచాయతీ భవన నిర్మాణం



మాధవగూడెంలో స్లాబ్ దశకు చేరుకున్న నిర్మాణ పనులు

మరో రెండు నెలల్లో పూర్తి



చిలుకూరు మండలంలో మూడు నూతన గ్రామ పంచాయతీలకు ఉపాధి హామీ పథకం నుంచి నిధులు మంజురయ్యాయి. ఒక్కో భవన నిర్మాణానికి రూ.20 లక్షల నిధులొచ్చాయి. భవన నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం స్లాబ్ దశకు చేరుకున్నాయి. మరో రెండు నెలల్లో పనులు పూర్తవుతాయి. పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం.

– లక్ష్మారెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ, చిలుకూరు

మోదీ పాలనపై సానుకూలంగా ప్రజలు

- మహారాష్ట్ర ఎమ్మెల్సీ నీల్యా నాయక్

హుజూర్‌నగర్ : ప్రధాని మోదీ పాలన పట్ల దేశ ప్రజలు సానుకూలంగా ఉన్నారని మహారాష్ట్ర ఎమ్మెల్సీ నీల్యానాయక్ అన్నారు. భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రవాస్ యోజనలో భాగంగా మంగళవారం హుజూర్‌నగర్‌లో పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఇతోధికంగా సహాయం చేస్తుందని చెప్పారు. గత 9 ఏళ్లుగా దాదాపు 7 లక్షల కోట్ల రూపాయల నిధులు కేటాయించిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు, వివిధ పథకాల కింద నిధులు విడుదల చేసిందని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై గ్రామగ్రామాన ప్రచారం చేయాలని కోరారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ గట్టు శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి మాట్లాడుతూ హుజుర్‌నగర్‌లో ఎంపీ, ఎమ్మెల్యేలు చేసిన అభివృద్ధి శూన్యమని అన్నారు. సీఎం కేసీఆర్ హైదరాబాద్‌లో ఎకరం 100 కోట్ల విలువగల భూములు అమ్మి ఆ డబ్బులతో గెలిచే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు డబ్బుని చూసి ఓటు వేస్తారో లేక దేశ భక్తి, ప్రధాని మోదీని, అభివృద్ధిని చూసి ఓటు వేస్తారో ఆలోచించుకోవాలని వారు కోరారు. తెలంగాణలో వచ్చే ఎన్నికలో డబుల్ ఇంజన్ సర్కార్ ఖాయమన్నారు. బీజేపీ పిలుపు మేరకు పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు పంచాలని కోరుతూ ఎమ్మెల్యేలు, మంత్రుల ఇళ్లు, కలెక్టరేట్‌ల ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వేముల శేఖర్‌రెడ్డి, జిల్లా పదాధికారులు, మండల అధ్యక్షులు, మండల పదాధికారులు, మోర్చా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మహారాష్ట్ర ఎమ్మెల్సీ నీల్యానాయక్

ఏఎన్ఎంలకు అండగా ఉంటాం : ఎంపీ

హుజూర్‌నగర్ : ఏఎన్ఎంలు చేస్తున్న ఆందోళనకు తమ మద్దతు ఉంటుందని నల్లగొండ ఎంపీ కెప్టెన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మంగళవారం హుజూర్‌నగర్‌లోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఏఎన్ఎంలు ఉత్తమ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సర్వీసులను క్రమబద్ధీకరణ చేయాలని ఆందోళన చేస్తున్న రెండవ ఏఎన్ఎంలకు అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఎన్నికల వ్యూహరచన సమావేశం..

హుజూర్‌నగర్‌లోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో సోమవారం రాత్రి పట్టణ, మండల, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులతో ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాబోయే ఎన్నికల వ్యూహ రచన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికలపై విపులంగా చర్చించారు. సమావేశంలో బ్లాక్, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ ఉత్తమ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఎన్ఎంలు

బీజేపీ గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు రవీందర్‌నాయక్

అనంతగిరి : బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మాజీ మంత్రి రవీందర్‌నాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం అనంతగిరి మండల కేంద్రంలో నిర్వహించిన ఎమ్మెల్యే ప్రవాస్ యోజన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీని గెలిపించేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఓర్సు వేలంగిరాజు, కోదాడ నియోజకవర్గ కన్వీనర్ కనగాల నారాయణ, నల్గొండ పార్లమెంటు నియోజకవర్గ పర్యవేక్షణ కమిటీ కన్వీనర్ వంగవీటి శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు ఏలేటి వెంకటేశ్వరరెడ్డి, నాయకులు చింతకుంట్ల సతీష్, రంగాచారి, బాలాజీనాయక్, రామారావు, అరుణ తదితరులు పాల్గొన్నారు.

బీసీలను దగా చేస్తున్న సీఎం కేసీఆర్



మాట్లాడుతున్న ధనుంజయనాయుడు

నేరేడుచర్ల : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు బీఆర్ఎస్ పార్టీ నుంచి తెలంగాణ సీఎం కేసీఆర్ తక్కువ సీట్లు కేటాయించి దగా చేస్తున్నాడని బీసీ సంక్షేమ సంఘం సూర్యాపేట జిల్లా కన్వీనర్ దూళిపాల ధనుంజయనాయుడు అన్నారు. మంగళవారం నేరేడుచర్లలో ఆయన విలేకరుల సమావేశంతో మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో ఒక్కశాతం ఉన్న వెలమలకు 11 స్థానాలు, 10 శాతం కూడా లేని అగ్రవర్ణాలకు 50 సీట్లు కేటాయించారని కానీ 60 శాతం ఉన్న బీసీలకు మాత్రం 20 సీట్లు ఇచ్చి బీసీలను అవమానించారన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి బీసీలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని అన్నారు. వచ్చే నెల మొదటి వారంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలో బీసీ గర్జన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఎల్లబోయిన సింహాద్రి, గోవింద్ గౌడ్, చిలకరాజు శ్రీను, రాజేష్, మధార్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థిగా జేవీఆర్ నియామకం హర్షణీయం

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : వైఎస్సార్‌టీపీ హుజూర్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పార్టీ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ జిల్లేపల్లి వెంకటేశ్వర్లు (జేవీఆర్)ను పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిలమ్మ నియమించడం హర్షణీయమని పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు మర్రి యశోదరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి సుతారి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం చింతలపాలెంలోని ఆ పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు నాగుల్ మీరా ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గంలోని మండల పార్టీ అధ్యక్షుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా జేవీఆర్‌ను నియమించడంతో పార్టీ బడుగు బలహీన వర్గాలకు ఎంత ప్రాధాన్యత ఇస్తుందో అర్థం చేసుకోవాలన్నారు. జేవీఆర్ గత 30 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్‌గా ఏడు ఏళ్లు ప్రజలకు సేవలు అందించారన్నారు. ఇప్పటివరకు నాయకులు మాయమాటలు చెబుతూ ఓట్లు వేయించుకొని ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. సీఎంగా వైఎస్ రాజశేఖరరెడ్డి చేసిన అభివృద్ధే తప్ప ఆ తర్వాత ప్రజలకు ఉపయోగపడే పథకాలు అమలు జరగలేదని చెప్పారు. వైఎస్ మరణం తర్వాత ఓదార్పు యాత్రలో భాగంగా వైఎస్ విజయమ్మ కోదాడ వస్తుండగా ఆమెను అడ్డుకుని అవమానించిన వారిని, వైఎస్ విగ్రహాలను పగులగొట్టించిన వారిని ఈ ఎన్నికల్లో తరిమి కొట్టాలని కోరారు. కార్యక్రమంలో చింతలపాలెం శాఖ అధ్యక్షుడు మార్తాల నాగిరెడ్డి, హుజూర్‌నగర్, పాలకీడు, మఠంపల్లి మండల పార్టీ అధ్యక్షులు మర్రి రవీందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కొండల్, నేరేడుచర్ల పట్టణ అధ్యక్షుడు ఉపేందర్, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌టీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు మర్రి యశోదరెడ్డి

గీత కార్మికుల సంక్షేమానికి కేఎల్ఎన్ ప్రసాద్ కృషి

కోదాడరూరల్ : గీత కార్మికుల సంక్షేమానికి కౌండిన్య సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, న్యాయవాది కేఎల్ఎన్ ప్రసాద్‌గౌడ్ చేస్తున్న కృషి అభినందనీయమని పలువురు నాయకులు అన్నారు. మంగళవారం కోదాడలోని కేఎల్ఎన్‌ప్రసాద్ నివాసంలో ఆయన జన్మదిన వేడుకలను కేఎల్ఎస్ యువసేన ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు, పలు పార్టీల నాయకులు, కుటుంబసభ్యులతో కలిసి ఆయన కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎలక సుధాకర్‌రెడ్డి, తమ్మినేని హనుమంతరావు, నాగార్జున, ఈదుల కృష్ణయ్య, గౌడ సంఘం నాయకులు బాలెబోయిన శ్రీనివాస్‌గౌడ్, వేలాద్రిగౌడ్, ఉయ్యాల వీరయ్యగౌడ్, ఉద్దండు, కాంపాటి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



జన్మదిన వేడుకల్లో కేఎల్ఎన్ ప్రసాద్, కుటుంబసభ్యులు, న్యాయవాదులు, నాయకులు

పల్‌రెడ్డి ఫౌండేషన్ సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న విద్యుత్ డీఈ వెంకటకిష్టయ్య

హుజూర్‌నగర్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు పల్‌రెడ్డి ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని విద్యుత్ డీఈ వెంకటకిష్టయ్య అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు పల్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) స్టడీ మెటీరియల్‌ను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పల్‌రెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకులు శాంపాల్‌రెడ్డి, శాంతిరెడ్డి, చైర్మన్ పల్‌రెడ్డి రాంరెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్ పల్‌రెడ్డి నర్సింహారెడ్డి, హెచ్ఎంలు ఎం.శ్రీనివాసరెడ్డి, టి.శ్రీనివాస్, ఎ.వెంకటేశ్వర్లు, ఆర్.శ్రీనివాస్, మాతంగి ప్రభాకర్‌రావు, వి.శ్రీనివాస్, రజిత, శౌరిరెడ్డి, శభాన, ఉస్మాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు

మఠంపల్లి : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీ కార్యాలయాలలో మంగళవారం స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఎంపీడీఓ జానకిరాములు, ఎంపీఓ అంజనేయులు వేర్వేరుగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. పెదవీడు, కొత్తతండా, అల్లీపురం తదితర గ్రామ పంచాయతీలలో రికార్డులను తనిఖీ చేయడంతో పాటు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించినట్లు తెలిపారు. ఎలాంటి అవకతవకలకు పాల్పడినా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు లక్ష్మణ్‌నాయక్, నరేందర్‌రెడ్డి అంగన్‌వాడీ టీచర్లు తదితరులు ఉన్నారు.



పెదవీడులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీఓ అంజనేయులు

బెల్ట్ షాపులతో యువత పెడదారి



ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం ఇస్తున్న బీఎస్పీ నాయకులు

హుజూర్‌నగర్ : బెల్ట్ షాపులతో యువత పెడదారి పడుతోందని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ రాపోలు నవీన్ కుమార్ అన్నారు. నియోజకవర్గంలోని బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఎస్పీ ఆధ్వర్యంలో మంగళవారం హుజూర్‌నగర్ ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డికి వినతిత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మద్యం, మత్తు పానీయాలకు బానిసలవుతున్నారని అన్నారు. యువతను చెడు వ్యసనాల నుంచి కాపాడేందుకు ప్రభుత్వం, పోలీస్ శాఖ తదితర శాఖలు ఉక్కుపాదం మోపాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కె.నర్సింహరావు, బి.సుబ్బుగౌడ్, నియోజకవర్గ అధ్యక్షుడు మంద రవి, నాయకులు రామస్వామి, ఎం.మట్టపల్లి, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్‌కు సొంత భవనం నిర్మించాలి

నేరేడుచర్ల : మున్సిపాలిటీ పరిధిలోని ఎస్సీ హాస్టల్‌కు సొంత భవనం నిర్మించాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మర్రి నాగేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. నేరేడుచర్లలో అద్దె భవనంలో నడిపిస్తున్న ఎస్సీ హాస్టల్‌లో మంగళవారం ఆయన సందర్శించి మాట్లాడారు. గత 40 ఏళ్లుగా ఎస్సీ హాస్టల్‌ను అద్దె భవనంలో నడిపిస్తుండటంతో సరిపడా వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఎస్సీ హాస్టల్‌కు స్థలం కేటాయించి భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ మండల కార్యదర్శి దోరేపల్లి వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు గుర్రం ఏసు, నాయకులు సైదులు, నాగరాజు, రవి తదితరులు ఉన్నారు.



ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మర్రి నాగేశ్వర్‌రావు

సాధారణ కాన్పుల సంఖ్య పెంచాలి

- డీఎంహెచ్ఓ డాక్టర్ హర్షవర్ధన్

మోతె : ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ కాన్పుల సంఖ్య పెంచాలని సూర్యాపేట జిల్లా వైద్యాధికారి డాక్టర్ హర్షవర్ధన్ అన్నారు. మంగళవారం మోతె మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశాడు. ఈ సందర్భంగా రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాలను సకాలంలో నిర్వహించాలన్నారు. ఆయన వెంట మోతె పీహెచ్‌సీ డాక్టర్ నాగరాజు, ఆరోగ్య సిబ్బంది తదితరులు ఉన్నారు.



మోతె పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ హర్షవర్ధన్

17న కోదాడలో 'గద్దర్ యాదిలో'

కోదాడ : తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన మలిదశ తెలంగాణ ఉద్యమకారులను ఏకం చేయడానికి సెప్టెంబర్ 17న కోదాడలో గద్దర్ యాదిలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఓయూ జేఏసీ నాయకులు కందుల మధు, ఎస్ఎం శ్రీకాంత్ తెలిపారు. మంగళవారం కోదాడ మార్కెట్ యార్డు అతిథి గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆంధ్ర సరిహద్దులో ఉన్న కోదాడలో తెలంగాణ సాధన కోసం ఎంతో మంది ఉద్యమకారులు కేసులకు బయపడకుండా ఉద్యమాన్ని ఉధృతంగా నిర్వహించారని అలాంటి ఉద్యమకారులు ఎలాంటి గుర్తింపు లేకుండా ఎక్కడో ఉండిపోయారని అన్నారు. వీరందరిని ఒకతాటిపైకి తీసుకొని రావడంతో పాటు తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన అమరుల ఆశయాలకు అనుగుణంగా ముందుకు వెళ్లడానికి కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విమలక్క, ఏపూరి సోమన్న, గద్దర్ కుమార్తె వెన్నెల పాల్గొంటారని, ఈ కార్యక్రమంలో విద్యార్థులు, మేధావులు, ఉద్యోగులు, ప్రజాసంఘాల నాయకులు ,ఉద్యమ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో పోలంపల్లి బాబు, ఉపేందర్, కిట్టు, సైదులు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఓయూ జేఏసీ నాయకులు

బీఆర్ఎస్ శ్రేణుల సంబరాలు

నడిగూడెం : బీఆర్ఎస్ పార్టీ కోదాడ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎమ్యెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ పేరును రెండోసారి ప్రకటించడం పట్ల మంగళవారం మండల కేంద్రంతో పాటు చాకిరాలలో బీఆర్ఎస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఎంపీపీ జ్యోతి ఎమ్యెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో చాకిరాల సర్పంచ్ యాతాకుల వీరస్వామి, సహకార సంఘం మాజీ చైర్మన్ సురేష్ ప్రసాద్, జాగృతి నియోజకవర్గ అధ్యక్షుడు గడ్డం మల్లేష్, బీఆర్ఎస్ గ్రామ శాఖల అధ్యక్షులు కాసాని పుల్లయ్య, ఫిరోజ్, నాయకులు రాజు, వెంకటనారాయణ, శ్రీనివాస్, సైదులు, వీరేశం, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

మఠంపల్లి : రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ హుజూర్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా మండలంలోని గుండ్లపల్లి వాసి, ఎమ్మెల్యే సైదిరెడ్డికి మూడవసారిగా టికెట్ దక్కడంతో ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మఠంపల్లిలో సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇరుగు పిచ్చయ్య, నాయకులు హఫీజ్‌ఖాన్, నవీన్‌నాయక్, సీతారామయ్య, అయ్యప్పాచార్యులు, బాలునాయక్, ఇరుగు ప్రభు, కుర్రి శ్రీను, పల్లె మట్టయ్య, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



నడిగూడెం : ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీపీ జ్యోతి

వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి

మోతె : వైద్యారోగ్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ ప్రకాష్‌రావు అన్నారు. మంగళవారం మోతె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన జన ఆరోగ్య సమితి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో పిల్లలు, బాలింతలు, గర్భిణుల ఆరోగ్య పరిరక్షణకు డాక్టర్లు, ఆరోగ్య సిబ్బంది 24 గంటలు వైద్య సేవలు అందించాలన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ నాగరాజు, జెడ్పీటీసీ పుల్లారావు, ఎంపీడీఓ వెంకటాచారి, సూపర్‌వైజర్ కమలమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టల్ సౌకర్యం లేక విద్యార్థుల అవస్థలు

నడిగూడెం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల జిల్లాలోని పలు మండలాలకు చెందిన విద్యార్థులకు కల్పతరువుగా మారింది. నడిగూడెం, మునగాల, మోతె, అనంతగిరి, చిలుకూరు, ఖమ్మం జిల్లా కూసుమంచి మండలాలకు చెందిన అనేక మంది విద్యార్థులు ఈ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యనభ్యసిస్తున్నారు. ఇక్కడ విశాలమైన భవనం, తరగతి గదులు, ల్యాబ్‌లు, సాధారణ కోర్సులతో పాటు, పలు వృత్తి విద్య కోర్సులు కూడా ఉన్నాయి. కానీ విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం లేకపోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కోదాడ, సూర్యాపేట, హుజూర్‌నగర్, తుంగతుర్తి జూనియర్ కళాశాలల్లో హాస్టల్ వసతి ఉందని, అధికారులు స్పందించి నడిగూడెంలో హాస్టల్ సౌకర్యం కల్పిస్తే విద్యార్థిని, విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందని విద్యార్థులు, తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

మట్టపల్లిలో నరసింహుని నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లిలో శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని మంగళవారం అర్చకులు వేదమంత్రాలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, మూలవిరాట్ స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అదేవిధంగా స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర, సహస్రకుంకుమార్చనలు గావించారు. కల్యాణతంతులో భాగంగా నూతన పట్టు వస్త్రాలతో స్వామిఅమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం చేపట్టారు. అనంతరం విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, పంచగవ్యప్రాశన, ఋత్విగ్వరణం, మధుపర్కపూజ, మాంగల్యధారణ నిర్వహించారు. అదేవిధంగా క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి తమలపాకులతో పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూర్ విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో నవీన్, అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, బ్రహ్మాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, ఆలయ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు, భక్తులు పాల్గొన్నారు.